




సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ఇళ్ల స్థలాలు, పట్టాల కోసం పాదయాత్ర

◆ 27న గుత్తిలో ప్రారంభం
◆ అనంతపురం వరకు యాత్ర
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలియజేశారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు గుత్తి నుంచి అనంతపురం వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, బాలరంగయ్యతో కలిసి రాంభూపాల్ మాట్లాడారు. జిల్లాలో పేదలకు సొంతింటి కల కలగానే మిగిలిందన్నారు. టిడ్కో, జగనన్న ఇల్లు అంటూ పేదలను ప్రభుత్వం మభ్య పెడుతూనే ఉందన్నారు. జిల్లాలో 68,288 జగనన్న ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటివరకు పూర్తయినవి కేవలం 6వేల ఇళ్లు మాత్రమే అన్నారు. అనేక సంవత్సరాలుగా పేదలు నివాసం ఉన్న కాలనీలకు పట్టాలు ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉందన్నారు. అనంతపురం నగరంలో శ్రీశ్రీ నగర్, నవయుగ కాలనీ, అభ్యుదయ నగర్, గుంతకల్లులో సిఐటియు కాలనీ, కల్లూరులో సుందరయ్య కాలనీల్లో నివాసం ఉన్న పేదలకు ఇప్పటికీ ఇళ్ల పట్టాలు ఇవ్వలేదన్నారు. అనంతపురం, పెద్దవడుగూరు, పామిడి, తాడిపత్రి, పుట్లూరు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా అధికారులు నోరుమెదపడం లేదన్నారు. ఇలాంటి ఆక్రమణలను అరికట్టి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన పాదయాత్ర ఈనెల 27న గుత్తిలో ప్రారంభం అయ్యి 29 అనంతపురం కలెక్టర్ కార్యాలయం వద్ద ముగుస్తుందని చెప్పారు. ప్రజలందరూ ఈ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


మహాసభలకు...

'అనంత' ముస్తాబు

◆ నేటి నుంచి ఏపి మున్సిపల్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు
◆ మూడు రోజులపాటు సభలు
◆ ఏర్పాట్లు పూర్తి చేసిన నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 14వ రాష్ట్ర మహాసభలకు అనంతపురం నగరం ముస్తాబయ్యింది. మూడు రోజులపాటు ఇక్కడ జరిగే మహాసభకు అతిథ్యమివ్వనుంది. ఇందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను జిల్లా నాయకత్వం పూర్తి చేసింది. దాదాపు రెండు మాసాలుగా జిల్లా నాయకులు దీని కోసం కసరత్తు చేశారు. నగరంలోని ప్రధాన కూడళ్ల అన్నింటిలోనూ సిఐటియు జెండాలతో అలంకరించారు. రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఫ్లెక్సీలనూ ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే కార్మికులకు స్వాగతం పలుకుతూ స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు మంగళవారం నాడు భారీ బహిరంగ సభతో మహసభ ప్రారంభం కానుంది. కృష్ణా కళామందిరం నుంచి టవర్‌క్లాక్ సప్తగిరి సర్కిల్ మీదుగా నగర పాలక సంస్థ కార్యాలయం వరకు జరిగే ప్రదర్శనలో వేలాదిగా కార్మికులు పాల్గొనను న్నారు. తదనంతరం కెఎస్ఆర్ కళాశాల ఆవరణంలో బహిరంగ సభ జరుగుతుంది. ఈ సభలో సిఐటియ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు జి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబుళు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. రెండో రోజు 21వ తేదీ నుంచి నగరంలోని షిర్డీసాయి కళ్యామంటపంలో ప్రతినిధుల సభలు ప్రారంభం కానున్నాయి. ఈ రెండు రోజులు జిల్లాల వారీగా సమీక్ష జరుగనుంది. మూడేళ్ల కాలంలో ఆయా జిల్లాలో జరిగిన పోరాటాలను సమీక్షించుకోనున్నారు. తదనంతరం భవిష్యత్ కార్యచరణ నిర్ణయిస్తారు. ఆఖరి రోజు 22వ తేదీన కొత్త కార్యవర్గం ఎన్నిక జరుగనుంది.





మహాసభల ప్రాంగణాన్ని సిద్ధం చేస్తున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు

ఏర్పాట్లు సిద్ధం

విశాఖలో జరిగిన 13వ మహాసభ నుంచి ఇప్పటి వరకు ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలను సమీక్షించనున్నారు. తదనంతరం రాబోయే మూడు సంవత్సరాల కాలంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యచరనను రూపొందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు మున్సిపల్ వర్కర్స్‌కు అనేక హామీలిచ్చి అమలు చేయలేదు. వీటిని సాధించుకోవడం కోసం ఏ రకమైన పోరాటాలను రూపొందాలన్నది ఈ మహాసభలో నిర్ణయించనుంది. మహాసభకు రాష్ట్రంలోని 123 మున్సిపాల్టీల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. నగరంలోని షిర్డీసాయి కళ్యాణమంటపంలో బుధవారం, గురువారం జరిగే ప్రతినిధుల సభలో అన్ని అంశాలపై లోతుగా చర్చిస్తారు. మహాసభ విజయవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లును పూర్తి చేసినట్టు ఆ సంఘం జిల్లా కార్యదర్శి నాగభూషణం తెలిపారు.



నివాళి అర్పిస్తున్న ఆవాజ్, కెవిపిఎస్, డివైఎఫ్ఐ, సిపిఎం నాయకులు

అమరవీరుల స్ఫూర్తితో

మతోన్మాద పాలనపై పోరాటం

ఆవాజ్ ఆధ్వర్యంలో రాంప్రసాద్ బిస్మిల్, అష్పకుల్లా ఖాన్‌కు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వాతంత్ర పోరాటంలో ఉరికంబాలను ముద్దాడిన అమరవీరుల స్ఫూర్తితో దేశంలో నేటి మతోన్మాద పాలనపై పోరు సాగించాలని ఆవాజ్ నాయకులు పిలుపునిచ్చారు. స్వాతంత్ర పోరాటంలో అమరులైన రాంప్రసాద్ బిస్మిల్, అష్పకుల్లా ఖాన్ వర్థంతిని ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, జిల్లా అధ్యక్షుడు వలీ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆ రోజుల్లో ఎందరో స్వాతంత్ర పోరాటంలో భాగస్వాములు అయ్యారన్నారు. ఈ పోరాటంలో వారి ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. ఈ కోవలోనే 1927 డిసెంబర్ 19వ తేదీన రాంప్రసాద్ బిస్మిల్, అష్పకుల్లాఖాన్‌లను బ్రిటీష్ సామ్రాజ్యవాదులు ఉరితీశారన్నారు. వారి బలిదానం తరువాత ఉవ్వెత్తిన ఎగిసిన పడిన ఉద్యమంతో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని చెప్పారు. ప్రస్తుతం మతోన్మాద పాలకులు ప్రజల మధ్య కుల, మత చిచ్చురేపుతున్నారని చెప్పారు. పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ ప్రజలను గాలికొదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇలాంటి మతోన్మాద పాలనకు వ్యతిరేకంగా నేటి యువత మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర్ కార్యదర్శి రామిరెడ్డి, ప్రకాష్, ఆవాజ్ నగర నాయకులు దాదు, ఇస్మాయిల్, అల్లాబాకాష్, ఫక్రు, ఫయాజ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, నాగరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, మల్లికార్జున, వన్నూరప్ప, విజయ్ పాల్గొన్నారు.

ముగిసిన టీచర్ల బదిలీల దరఖాస్తు గడువు

7500కు పైగా దరఖాస్తులు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తు గడువు సోమవారం ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 7500 మందికి పైగా టీచర్లు దరఖాస్తులు చేసుకున్నారు. మంగళవారం నాడు ఎంఇఒలు, డివైఇఒలు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పరిశీలించి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపడం జరుగుతుంది. ఆ తర్వాత జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పదికి పైగా టీంలు ఏర్పాటు చేసి ఆ దరఖాస్తులను పరిశీలించి సీనియార్టీ జాబితాను తయారు చేయనున్నారు. ఆ తర్వాత సీనియారిటీ జాబితాపై ఆన్లైన్ లోనే అభ్యంతరాలు స్వీకరించనున్నారు. తర్వాత జీవో ప్రకారంగానే బదిలీలను నిర్వహిస్తామని ఆర్జేడీ, ఉమ్మడి అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకట కృష్ణారెడ్డి తెలిపారు.



భిక్షాటన చేస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భిక్షాటన

అనంతపురం : సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాలోకేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం నగరంలోని బస్టాండ్ సెంటర్‌లో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు కాస్మోటిక్, మెస్ ఛార్జీలు పెంచాలని, శిథిలావస్థలో ఉన్న వసతిగృహాల స్థానంలో కొత్తవి నిర్మించాలని, రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని, నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి తాము చేసిన భిక్షాటన చేసిన డబ్బులను సిఎం జగన్‌రెడ్డికి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జిమ్ము శివ, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రాజశేఖర్, బన్నీ, సురేష్, బద్రి, చంద్రశేఖర్, అనిమేష్, ప్రశాంత్, ఇర్ఫాన్ ,దర్శన్, చాంద్ భాష, శివమణి, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుతోనే భావితరాలకు భవిష్యత్తు

గుత్తి : విద్యుత్‌ను ఆదా చేయడం ద్వారా భావితరాల భవిష్యత్తు ఉంటుందని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఎపిఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ వాడకంపై అవగాహన పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ కార్యాలయం నుంచి ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్, గాంధీచౌక్ మీదుగా రాజీవ్ గాంధీ సర్కిల్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఇఇ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపుగా వాడాలని కోరారు. కావున ప్రతి ఒక్కరూ ఇంధన సంరక్షణ, పరిరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌పిడిసిఎల్ డిఇ మేఘరాజ్, ఎఇలు ఎం.శ్రీకుమార్, కె.మధుసూదన్‌రావు, షఫీ, లైన్ ఇన్స్‌పెక్టర్లు కె.నాగేంద్రప్రసాద్, ప్రహల్లాద, సూర్యనారాయణ, దేవకుమార్, తిరుపాల్‌నాయక్, సిబ్బంది, వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ఉత్తేజపూరితం..!

◆ "బహుజన సాంస్కృతిక ఉత్సవాలు" ప్రారంభం
◆ ఆకట్టుకున్న 'సత్యశోధన' జ్యోతిరావుపూలే నాటక ప్రదర్శన



బహుజన సాంస్కృతిక ఉత్సవాలను ప్రారంభిస్తున్న పుర ప్రముఖులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు అనంతపురం నగరంలోని లలిత కళా పరిషత్‌లో జరుగుతున్న బహుజన సాంస్కృతిక ఉత్సవాలు ఉత్తేజపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఐద్వా, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, ప్రజానాట్యమండలి, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నృత్యరూపక నాటక ప్రదర్శనలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. లలిత కళాపరిషత్ జరుగుతున్న ఈ ఉత్సవ ప్రారంభోత్సవ కార్యక్రమానికి లలిత కళాపరిషత్ అధ్యక్షులు వెంకట సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి పద్మజ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, మానవతా రక్తదాతల సంస్థ ప్రతినిధి తమరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి, అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరీలతోపాటు ప్రజా సంఘాల నాయకులతోపాటు, పుర ప్రముఖులు హాజరయ్యారు. ఉత్సవాల ప్రారంభానికి ముందు జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు వెంకట సుబ్బయ్య తదితరులు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావం మనుషులపై తీవ్రంగా ఉందన్నారు. సీరియల్, ఇతర సోషియల్ మీడియా యుగంలో ఇటువంటి ఆలోచింపజేసే కార్యక్రమాలకు ఆదరణ తగ్గిందన్నారు. ఇటువంటి సమయంలో హైదరాబాద్‌కు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు ఆధునిక పద్ధతుల్లో చేపట్టిన నృత్యరూపక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటోందన్నారు. అంతేకాకుండా నేటి తరానికి ఆనాటి ప్రముఖుల జీవితాలను కళ్లకు కట్టినట్టు ప్రదర్శిస్తున్నారు. ఇది అందరిలోకి తీసుకెళ్లాల్సిన అవసరం నేడు ఎంతగానో ఉందని పేర్కొన్నారు.

ఆలోజింపజేసే 'సత్యశోధన'

సత్యశోధన పేరుతో జ్యోతిరావుపూలే, సావిత్రీబాయి పూలేల జీవిత చరిత్రను కళ్లకు కట్టినట్టు హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు చేపట్టిన నృత్యప్రదర్శ అందరినీ ఆలోజింపజేసే విధంగా సాగింది. ఈ ప్రదర్శనకు పెద్దఎత్తున తరలివచ్చిన విద్యార్థులు ఆద్యంతం నృత్యరూపక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. 1827 సమయంలో సమాజంలో విద్య అందరికీ కాకుండా కొందరికే అన్న విధంగా ఉన్న సమయంలో జ్యోతిరావుపూలే, సావిత్రి బాయి పూలేలు అప్పటి పరిస్థితులకు ఎదురొడ్డి సమాజాభివృద్ధికి విద్య యొక్క ప్రాధాన్యతను తెలియజేసే విధంగా కృషి చేశారు. అందుకోసం ఎన్ని ఆటంకాలు ఇబ్బందులు ఎదురొచ్చిన తట్టుకుని ముందుకు సాగారు. ప్రధానంగా మహిళా విద్య కోసం ఆనాడు వారు చేసిన కృషి నాటక రూపంలో కళాకారులు చేసిన ప్రదర్శనకు అందరినీ కట్టిపడేసింది.







సత్యశోధన నాటికలోని దృశ్యాలు

గొర్రెల మందపై దూసుకెళ్లిన టిప్పర్

25 గొర్రెలు మృతి

బెలుగుప్ప : గొర్రెల మందపై టిప్పర్ దూసుకెళ్లడంతో 25 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందిన ఘటన సోమవారం నరసాపురం–గుండ్లపల్లి గ్రామాల మధ్య చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక పరశురాం పురానికి చెందిన గొర్రెల కాపరులు గొర్రెలు మందను రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గం తీసుకొస్తుండగా నరసాపురం గుండ్లపల్లి మార్గమధ్యలోకి రాగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ గొర్రెల మందపై వెళ్లింది. దీంతో 25 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రూ.లక్షల నష్టం వాటిల్లిందని గొర్రెలు కాపరుల ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై రామకృష్ణయ్య హుటాహుటిన ఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. ప్రమాద గురైన టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్ : విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సేవా దక్పథం అలవర్చుకోవాలని విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని 74 ఉడేగోళం ఆర్డీటీ ప్రాంగణంలో కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉడేగోళంలో ఏడు రోజుల జాతీయ సేవా పథక ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఇందుకు వాలంటీర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్ గోవర్ధన్‌ను అభినందించారు. అలాగే విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సేవాభావాలను అలవర్చుకుంటే సమాజానికి ఎంతో మేలు చేసిన వారవుతారన్నారు. అనంతరం కళాశాల అదనపు గది నిర్మాణం కోసం ఆర్థికసాయం అందజేసిన విప్ కాపు రామచంద్రారెడ్డికి వైస్ ప్రిన్సిపల్ రవికుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, అధ్యాపకులు కిరణ్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, రామకృష్ణ, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మెమొంటో అందజేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



పనులను పరిశీలిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు

రూ.50లక్షలతో నగరంలో రోడ్ల మరమ్మతులు

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో వర్షాల వల్ల వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లను రూ.50 లక్షలతో మరమ్మతులు చేపట్టనున్నట్లు మేయర్ మహమ్మద్ వసీం స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని 47, 48వ డివిజన్ల పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను మేయర్ పరిశీలించారు. ఇందులో భాగంగా పనుల పురోగతిని అడిగి తెలుసుకుని త్వరితగతిన పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా నగరంలోని కొన్నిచోట్ల చిన్న, చిన్న గుంతల వద్ద డస్ట్ వేస్తూ జనసేన నేతలు ఫొటో షూట్ చేసి పబ్లిసిటీ పొందే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. నిజంగా వారికి ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే డస్ట్ పౌడర్ కాకుండా సిమెంటు, తారు ప్యాచ్‌వర్క్‌లు వేసి ఉంటే హర్షించేవారమన్నారు. కేవలం పబ్లిసిటీ చేసే వారి ప్రయత్నాలను ప్రజలు ఎవరూ నమ్మరన్నారు. అలాగే టిడిపి నేతలు కూడా అభివృద్ధిపై మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఇప్పుడు జిమ్మిక్కులు చేస్తున్న టిడిపి నాయకులు నిజంగా మంచి పనులు చేసి ఉంటే 50 డివిజన్లలో ఓడిపోయే పరిస్థితి ఉండేది కాదన్నారు. మూడున్నరేళ్ల వైసిపి పాలనలో సిఎం జగన్ సహకారంతో రూ.800 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్ట్‌ల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు మరో రూ.25కోట్ల స్పెషల్ గ్రాంట్ పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం కింద వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సచివాలయానికి రూ.20లక్షల చొప్పున మరో రూ.15 కోట్లు నగరానికి విడుదల కానున్నట్లు తెలిపారు. వీటికి సంబంధించి ఇప్పటికే రూ.6 కోట్లు మంజూరు కాగా వీటిలో కొన్ని పనులు పూర్తి కూడా అవుతున్నాయన్నారు. అంతకు మునుపు 1 వ డివిజన్ పరిధిలోని లెక్చరర్ కాలనీలో బుధవారం నిర్వహించే మొక్కలు నాటే కార్యక్రమ ప్రాంతాన్ని, 14వ డివిజన్‌లో కాలువలను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్లు వాసంతి, కొగటం విజయ భాస్కర్‌రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, ఎస్ఇ నాగమోహన్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎకరాకు రూ.50వేలు పరిహారం ఇవ్వాలి - సిపిఎం ఆధ్వర్యంలో జిల్లాలో నిరసనలు


గుంతకల్లులో తహశీల్దార్ రాముకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మాండూస్ తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాల రంగయ్య, జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తేరన్నపల్లి, దిగువపల్లి, ఎగువపల్లి, కోనుగుంటపల్లి, తిమ్మాపురం, చిన్నపొడమల, పెద్దపొడమల తదితర గ్రామాల్లో అధిక మంది రైతులు పత్తి పంటను సాగుచేశారన్నారు. అయితే నకిలీ పత్తి విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరి, కంది పప్పుసెనగ, వేరుశనగతోపాటు ఉద్యానవన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కావున అధికారులు గ్రామాలవారీగా పంట నష్టం అంచనా నివేదికలను నిష్పక్షపాతంగా తయారు చేసి రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులకు మాగాణి తరి భూములు ఉన్న వారికి రేషన్‌కార్డు, పింఛన్లు ఇవ్వాలని, కౌలు రైతులకు రైతు అనుమతితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, ప్రభుత్వం ఇస్తున్న పరిహారం నిజమైన సాగుదారులకు అందేలా చూడాలన్నారు. అనంతరం తహశీల్దార్ మునివేలుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, హనుమంతురెడ్డి, ఉమాగౌడ్, బాలచౌడయ్య, రామ్మోహన్, శ్రీరాములు, రైతులు బాలనరసింహారెడ్డి, శంకరయ్య, రామాంజనేయులు, రాముడు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని కార్యాలయంలో తహశీల్దార్ రాముకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ వల్ల గ్రామాల్లో జరిగిన పంట నష్టనష్టాన్ని అధికారులు నిష్పక్షపాతంగా అంచనా వేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.50 వేల పంట నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగ్గలి రమేష్, నాగార్జున, వీరన్న, కిషోర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు వి.నిర్మల డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా వారం రోజులు పాటు జిల్లాలో కురిసిన వర్షాలకు వరి, కంది, పప్పుశెనగ, వేరుశెనగ, పత్తి పంటలతో పాటు పండ్ల తోటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే కల్తీ, నాశరకం పత్తి విత్తనాల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం, బీమా ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.మున్ని, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు. మల్లికార్జున, సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్, సిఐటియు నాయకురాలు డి.పద్మావతి, టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల పరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ ఉషారాణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి మాట్లాడుతూ మాండూస్ తుఫాన్ కారణంగా వారం రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలో సాగు చేసిన వరి, కంది, వేరుశనగ, పప్పుసెనగ, పత్తితో పాటు ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. కావున అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన రైతులకు నష్టపరిహారం వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఇస్మాయిల్, ఓబులేసు, శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ డిమాడ్ చేశారు. ఈమేరకు సోమవారం రైతుసంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రలోని తహశీల్దార్ కార్యాలయంలో సిఎస్‌డిటికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మండూస్ తుఫాన్ కారణంగా మండలంలో సాగు చేసిన మిర్చి, వరి, మిరప, వేరుశనగ, జొన్న, పత్తి తదితర పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందన్నారు. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సరస్వతి, జయమ్మ, రైతులు పాల్గొన్నారు.

పుట్లూరు : తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ తుపాను కారణంగా మండల వ్యాప్తంగా కంది, పప్పుశనగ, పత్తి, అరటి పంటలతోపాటు ఉద్యాన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కావున రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.టి.రామాంజినేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్య.కా.సం మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నాయకులు నాగభూషణం, సత్తార్ రామకృష్ణ, రామచంద్రుడు, రైతులు రాముడు, శేషారెడ్డి, రాజశేఖర్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : మండలంలో తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కార్యదర్శి లోకేష్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలకు వరి, కంది, పప్పుసెనగ, వేరుశనగ, పత్తి తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. కావున వెంటనే ఎకరాకు రూ.50 వేలు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం కమిటీ సభ్యులు మల్లికార్జున, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.


ఉరవకొండలో సిఎస్‌డిటికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం, రైతుసంఘం నాయకులు


శింగనమలలో తహశీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

శింగనమల : మండోస్ తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, రైతుసంఘం మండల కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వారంరోజులుగా కురిసిన వర్షాలకు వరి, కంది, పప్పుసెనగ, వేరుశనగ, పత్తితోపాటు పలు ఉద్యానవన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేసి రైతులకు పరిహారం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతులకు కూడా రైతు నమతితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేసి ప్రభుత్వం ఇస్తున్న పరిహారం చెల్లించాలన్నారు. గత ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు ప్రకటించిన బీమాలో రూ.60 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండారెడ్డి, శ్రీనివాసులు, కుళ్లాయిస్వామి, నాగరాజు, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ శంకరయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహశీల్దార్ రాముకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ వల్ల గ్రామాల్లో జరిగిన పంట నష్టనష్టాన్ని అధికారులు నిష్పక్షపాతంగా అంచనా వేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అలాగే రాప్తాడు మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మీనరసింహులుకు సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎం.పోతలయ్య తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గాండ్లపర్తి పోతలయ్య, సుబ్బిరెడ్డి, వన్నప్ప, కొండారెడ్డి, మల్లికార్జునరెడ్డి, వీరన్న, ఆదెప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని రైతుసంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి, సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం రైతుసంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సిఎస్‌డిటి రమేష్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ వల్ల జిల్లాలోని 15 మండలాల్లో మిర్చి, వరి, మిరప, వేరుశనగ, జొన్న, పత్తి తదితర పంటలు నష్టపోయారన్నారు. కావున అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి నష్టపోయిన పంట వివరాలను నమోదు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉరవకొండ : పట్టణంలోని 11వ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వైసిపి నాయకులు ఎం.జిలాన్‌బాషా, ఎం.రఫిక్ కోరారు. ఈమేరకు సోమవారం స్థానిక వార్డు ప్రజలతో కలిసి పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని 11వ వార్డులో అనేక సమస్యలు నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా కొండప్ప బావి వెనుక వీధిలో 5 నెలలుగా పబ్లిక్ నీటి ట్యాంకు మోటారు చెడిపోవడంతో నానాఇబ్బందులు పడుతున్నారన్నారు. పైపులో చెట్ల వేర్లు పేరుకుపోవడంతో మంచి నీరు సరిగ్గా రావడం లేదన్నారు. వెంటనే నూతన బోరు మోటారు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పార్కు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రాథమిక పాఠశాల పక్కన ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ పాయింట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక

గుత్తి : రాష్ట్రస్థాయి యోగా పోటీలకు గుత్తి విద్యార్థులు ఎంపికైనట్లు ఆర్కే యోగా ఉచిత శిక్షణ కేంద్రం నిర్వాహకులు రామకష్ణారావు తెలిపారు. ఈమేరకు అనంతపురంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (ఎస్ఎపి) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో గుత్తికి చెందిన బాల, బాలికలు పాల్గొన్నట్లు తెలిపారు. ఈపోటీల్లో హర్షవర్ధన్, ప్రవీణ్ ప్రసాద్ ప్రథమ స్థానంలో, ఖ్యాతి రెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. వీరు ఈనెల 25న తిరుపతి, కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ముగ్గురు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు

21న విద్యార్థులకు ట్యాబులు పంపిణీ

అనంతపురం సిటీ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ఈనెల 21న బైజ్యూస్ ట్యాబులు పంపిణీ చేయనున్నట్లు ఆర్‌జెడి ఎం.వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం నగరంలోని కెఎస్ఆర్ పాఠశాలలో ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 23114 మంది విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డిప్యూటీ డిఇఒ పద్మప్రియ, అసిస్టెంట్ ఎంఇఒ మాధవరెడ్డి, కెఎస్ఆర్ పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం జగన్నాథ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగోళీ పోటీలు

నార్పల : ముఖ్యమంత్రి జగన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్ఆర్ వెలుగు కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని కెవికె ఇండోర్ స్టేడియం ఆవరణలో రంగోలీ పోటీలు నిర్వహించనున్నట్లు ఎపిఎం తిప్పమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు రంగోలి సామగ్రితో సోమవారం ఉదయం పది గంటలకు పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈపోటీల్లో ముగ్గురు విజేతలను ఎంపిక చేసి ఈనెల 21న బుధవారం ఎస్ఆర్ఐటి కళాశాలలో నిర్వహించే రంగోలీ ఫైనల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

జగన్ పాలనపై విసుగెత్తిన ప్రజలు

'ఇదేం ఖర్మ'లో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగన్ పాలనపై ప్రజలు విసుగెత్తిపోయారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా చంద్రబాబును సిఎం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని ఆకులేడు గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చిన పార్టీ టిడిపి అన్నారు. టిడిపి హయాంలో బిసికార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు, బీసీ భవనాలు, పెళ్లికానుక, విదేశీ విద్య, ఆదరణ పనిముట్లుతోపాటు బీసీలను రాజకీయంగా ముందుకుతెచ్చినట్లు వివరించారు. ఇకపోతే జగన్ అధికారంలోకి వచ్చాక ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రాష్ట్రంలో ఎవరూ సుఖశాంతులతో లేరన్నారు. మళ్లీ చంద్రబాబు అధికారం చేపడితేనే పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, ఎం.ఆదినారారణ, తెలుగు యువత అధికార ప్రతినిధి బ్యాళ్ల సుదర్శన్, తెలుగు యువత జిల్లా కార్యదర్శి నగరూరు పెద్దన్న, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, మైనార్టీ సెల్ కార్యనిర్వహక కార్యదర్శి మహ్మద్‌గౌస్, నాయకులు పవన్, అక్బర్, వడ్డే ఆంజనేయులు, రవి, బాలకుళ్లాయప్ప, నారాయణస్వామి, సుబ్బరాయుడు, హరి, వెంకటేష్, నారప్ప, ఓబులేష్, ఎన్.రామాంజనేయులు, దాసరి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండలంలోని గూగూడు పంచాయతీ నడింపల్లి గ్రామంలో టిడిపి నాయకులు సోమవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిత్యావసర ధరల పెరుగుదల, ఇసుక, సిమెంటు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు, కరెంటు బిల్లులు, ఇంటి పన్నులు, బస్సుఛార్జీల పెంపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షులు జాఫర్‌వలి, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి రాజన్న, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు బండ్లపల్లి కుళ్లాయప్ప, లక్ష్మీనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జి గంగాధర్‌నాయుడు, నాయకులు రామానాయుడు, వెంకటనాయుడు, రాజశేఖర్, రాజగోపాల్‌నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవేంద్ర, వెంకటరమణప్ప, భార్గవ్‌నాయుడు, గోపాల్‌రెడ్డి, చౌడయ్య, శివయ్య, విజయ్‌కుమార్, రాజేష్, పుండరి, జయచంద్రనాయుడు, కేశవులు, దేవేంద్ర, వెంకట్రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందే..

ఎంఆర్‌పిఎస్ నాయకుల ఆందోళన

ప్రజాశక్తి-ఉరవకొండ

స్వార్థ రాజకీయాలు మానుకుని ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందేనని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కేంగూరి ఎర్రిస్వామి, మండల అధ్యక్షులు తిప్పయ్య, ఎస్సీ,ఎస్టీ ప్రజా సమైక్య తాలూకా అధ్యక్షులు వీరప్ప డిమాండ్ చేశారు. సోమవారం విడపనకల్ మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ పిలుపుమేరకు అన్ని మండల కేంద్రాల్లోని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే 19న ఆర్డీవో కార్యాలయం ఎదుట, 23న కలెక్టర్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. అనంతరం తహశీల్దార్ బ్రహ్మయ్య, ఎంపిడిఒ శ్రీనివాసులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గురుప్రసాద్, నాగేంద్ర, అల్లేప్ప, ఎమ్మెస్ఎఫ్ మండల అధ్యక్షులు ఉదయ్‌కుమార్, పునీత్, ప్రేమ్, చైతన్యకుమార్, ఆసీస్, మోహన్, దినేష్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : ప్రస్తుత శీతాకాల పార్లమెంట్ సమావేశల్లోనే ఎస్సీ వర్గీకరణకు కేంద్రం ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మహాజన సోషలిస్టు పార్టీ మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పోరాట సమితి నాయకులు సామ్రాట్ కేబీ మధు మాదిగ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా వర్గీకరణ చేయకుండా నాయకులు మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం స్పందించి ప్రస్తుత శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో శింగనమల ఇన్‌ఛార్జి కదిరప్ప, ఎంపిఎస్ నాయకులు వెంకటేశు అదెమ్మ, నిషార్ అహమ్మద్, రామకృష్ణ, శ్రీరాములు, రెడ్డిపల్లి నాగరాజు, అమ్మవారిపేట కొండా, తదితరులు పాల్గొన్నారు.


ఉరవకొండలో వినతిపత్రం సమర్పిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

నార్పల : వచ్చే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఎస్సీలకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ నారాయణస్వామికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లప్ప, రామ్మోహన్, పెద్దిరాజు, పెద్ద గంగయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఆర్‌డిఒ రవీంద్ర, తహశీల్దార్ రాము, తదితరులు

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

గుంతకల్లు : మండల పరిధిలోని కసాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనారాయణ స్వామి సమేత రాతి ఆలయం ముద్రించిన నూత సంవత్సర క్యాలెండర్‌ను ఆర్‌డిఒ రవీంద్ర, తహశీల్దార్ బి.రాము సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ రవీంద్ర మాట్లాడుతూ తలారి పరుశురాముడు పేదరికంలో జన్మించి స్వయంకృషితో ఎదుగుతూ తాను సంపాదించిన దానిలో తోటివారి కష్టాల్లో పాలుపంచుకోవాలని టిపిఆర్ ట్రస్టు స్థాపించడం ప్రశంసనీయమన్నారు. ఈయన ట్రస్టు ద్వారా 12 సంవత్సరాలుగా మానవసేవ చేస్తూ అనేక రకాలుగా విద్య, వైద్యం, నిరుద్యోగులకు జాబ్‌మేళాలు,పెళ్లిళ్ల వంటి సేవలు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఆధ్యాత్మికతను పెంపొందిస్తూ దైవమార్గం వైపు మళ్లి కసాపురం గ్రామంలో లక్ష్మీనారాయణ సమేత నూతన రాతి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కసాపురం ఎస్ఒ గోపాలుడు, రిటైర్డ్ తహశీల్దార్లు చలపతి, ఇఒ రాముడు, కమిటీ సభ్యులు నాగేంద్ర, మునీశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బుక్కరాయసముద్రం విద్యార్థులు

బుక్కరాయసముద్రం : శ్రీకాకుళం జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 21 నుంచి23వ తేదీ వరకూ జరిగే అండర్-17 స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొననున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుమంగళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పాఠశాలలో 10వ తరగతి చదివే అరవింద్‌రెడ్డి, నరసింహా, గణేష్ ఈనెల 7న నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున అందజేసినట్లు తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులను వెలికితీయడమే ధ్యేయం

ఉరవకొండ : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను వెలికి తీయడమే ధ్యేయంగా జిల్లాస్థాయి పాఠశాలల క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ వై.శివరామ్‌రెడ్డి తెలిపారు. సోమవారం వజ్రకరూరు మండల పరిధిలోని కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి పాఠశాలల క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. అలాగే విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయి జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, ఉపాధ్యాయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామ్‌రెడ్డి

నేరాలు ఘోరాలు

బాలిక ఆత్మహత్య


మృతిచెందిన సలీమా

ఆత్మకూరు : మండల కేంద్రంలోని తోపుదుర్తి గ్రామంలో సోమవారం ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు తోపుదుర్తి గ్రామానికి చెందిన సలీమా(18) సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమణించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఎస్ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వివరాలు తెలియాల్సి ఉందన్నారు.


ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులతో మేయర్ వసీం

నైపుణ్యాలు పెంచుకుంటేనే ఉపాధి అవకాశాలు : మేయర్ వసీం

అనంతపురం : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకుంటేనే మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని మేయర్ వసీం సలీం సూచించారు. ఈమేరకు సాయి ట్రస్టు అధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సోమవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కావున అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. అలాగే పేద విద్యార్థి కోసం సాయి ట్రస్ట్ వారు కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సాయి ట్రస్టు అద్యక్షుడు విజయ సాయికుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం 17 సంవత్సరాలుగా తమ ట్రస్టు ఆధ్వర్యంలో కంప్యూటర్‌లో శిక్షణ ఇచ్చి ప్రశంసాపత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ రాఘవేంద్ర, ట్రస్టు ఎఒ నారాయణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ కన్వీనర్‌ని కలిసిన టిడిపి నాయకులు

అనంతపురం : మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన బీసీ సెల్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, బీసీ విభాగం రాష్ట్ర కన్వీనర్ కొల్లు రవీంద్రకు అనంతపురం టిడిపి నాయకులు సోమవారం కలిశారు. ఈమేరకు ఆయనకు బొకే అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు,రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గంజే నాగరాజు, శివబాల, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమ నాయకురాలు కమలమ్మకు నివాళి

అనంతపురం: కమ్యూనిస్టు ఉద్యమ నాయకురాలు కమలమ్మకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నివాళులర్పించారు. కమలమ్మ మూడు రోజుల క్రితం మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న రామకృష్ణ సోమవారం మృతురాలి ఇంటికి చేరుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, నగర కార్యదర్శి రామిరెడ్డి, జిల్లా నాయకుడు నల్లప్ప, కమలమ్మ, తదితరులు సంతాపం తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలమ్మతోపాటు భర్త వెంకటరమణప్ప, కుమారులు దామోదర్ లీలాధర్, నాగరాజు, కుమార్తె తులసి అనేక కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, జిల్లా నాయకులు సంజీవప్ప, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం


కంటి పరీక్షలునిర్వహిస్తున్న డాక్టర్ అక్బర్

అనంతపురం : నగరంలోని డాక్టర్ అక్బర్ కంటి ఆసుపత్రిలో సోమవారం ఉచిత నేత్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అక్బర్ సాహెబ్, డాక్టర్ షాజమా కలిసి దాదాపు 90 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 22 మందికి శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వీరందరికీ అక్బర్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు డాక్టర్ అక్బర్ సాహెబ్ తెలిపారు ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.కృష్ణశర్మ, డాక్టర్ బాలాకుమారి, డాక్టర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్లూరు : మండలంలో ఖాళీగా ఉన్న వాలంటరీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ యోగానందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 28వ తేదీ లోపు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అధికఫీజులను అరికట్టాలి

ఉరవకొండ : ఈ టెక్నో పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న పట్టణంలోని ఎవిఆర్ వివేకానంద ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, కార్యదర్శి యశ్వంత్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఉరవకొండలోని తహశీల్దార్ కార్యాలయం, అనంతపురంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈటెక్నోకు సంబంధించి బిల్డింగ్, మైదానం, అనుమతులు లేనప్పటికీ యథేచ్ఛగా ఈ టెక్నో పాఠశాలలు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అధిక ఫీజులను వసూలు చేస్తున్న పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దంత వైద్యశాల ప్రారంభం

బొమ్మనహాల్ : మండలంలోని ఎల్బీనగర్‌లో ఏర్పాటు చేసిన దంత వైద్యశాలను తహశీల్దార్ శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహంతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దంత వైద్యశాల ఏర్పాటు చేయాలని తమ నాన్న కల నెరవేరిందన్నారు. వైద్యులు తమ వైద్యవిద్యను పూర్తి చేసిన వెంటనే పట్టణాల్లో కాకుండా గ్రామాల్లో ఆసుపత్రులను ప్రారంభించి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. పేదలకు సేవ చేయాలన్న ఉద్దేశంతోనే తాము ఇక్కడ వైద్యశాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి షణ్ముఖయ్య, దంత వైద్యులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు పాల్గొన్నారు.


దంత వైద్యశాలను ప్రారంభిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసులు